విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 16, నవంబర్ 2023

మహాసభలు జయప్రదం చేయండి- ఏఐటీయూసీ

విశాలాంధ్ర -నంద్యాల : ఈ నెల 17,18,19 తేదీల్లో నంద్యాల్లో జరగనున్న ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య 15 వ రాష్ట్ర మహాసభలలో మహిళా కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, ఎం.రమేష్‌బాబులు పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక గోస్పాడు మండల కేంద్రంలో మిడ్ డే మిల్, హాస్టల్ కార్మికులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా హక్కుల పరిరక్షణకై తమ సమ సమాజ స్థాపన కోసం మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఉద్యమాలు కొనసాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య రాష్ట్ర మహాసభలు నంద్యాల వేదికగా జరుగుతున్నాయని, ఈ మహాసభలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు,ఉద్యమ భవిష్యత్ కార్యాచరణ దిశగా ఈ మహాసభలు జరుగుతాయన్నారు. దేశంలో ప్రభుత్వ పథకాలలో పని చేస్తున్న లక్షలాది మంది మహిళా కార్మికులు అభద్రత భావంతో, పని చేసే చోట భద్రత లేక వేతనాల పెంపుదల లేక పనిచేస్తున్నారని, దేశంలో నిత్యం మహిళలపై దాడులు, అత్యాచారాలు అధికమయ్యాయన్నారు. మానవమృగాల అరాచకాలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. ఎన్నికల లబ్ధి కోసం మహిళా బిల్లును వాడుకోవడం సిగ్గుచేటన్నారు. మహాసభల జయప్రదం కోసం కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ స్కిం వర్కర్స్ నాయకులు దస్తగిరమ్మ, వరలక్ష్మి,లక్ష్మిదేవి హేమలత, గోపాలమ్మ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జామపంట దున్నివేత

విశాలాంధ్ర -చాగలమర్రి: మండల పరిధిలోని ముత్యాలపాడుకు చెందిన రైతు తను సాగు చేస్తున్న జామ పంటను దున్నేసిన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన రైతు లింగమయ్య అనే రైతు ఉపాధి హామి పథకం క్రింద తన రెండెకరాల పొలంలో రెండేళ్ళ క్రితం సుమారు 1800 జామ మొక్కలు నాటారు.పంట సరిగారాక వైరస్,తెగుళ్ళ బారీన పడి దిగుబడి రాకపోవడంతో దిక్కు తోచని స్థితిలో పంటను ట్రాక్టర్‌తో దున్నేయాల్సి వచ్చిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.3 లక్షలు నష్టపోయామని రైతు వాపో యారు.ఉపాధి హామీ కింద తనకు రావాల్సిన సొమ్ము కూడా రాలేదన్నారు.ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతు కోరారు.

స్పందన ఫిర్యాదుకు స్పందించిన సూపరింటెండెంట్.. వైద్యులు

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు

విశాలాంధ్ర - నంద్యాల: నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మందులు (డ్రగ్స్) బయటికి రాయడంపై విచారణ చేపట్టి బయటికి రాయకుండా హస్పిటల్ లోనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శులు నాగరాముడు, ధనుంజయలు డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూరో, కార్డియాలజీ, వైద్యసిబ్బంది తక్షణమే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని కర్నూలుకు రెఫర్ చేయడం మానుకోవా లన్నారు. చికిత్సకు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగుల పట్ల నర్సులు, సిబ్బంది అసభ్యకర పదజాలం మానుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యశాల ప్రధాన గేటు ముందు వాహనాల రద్దీ సమస్యను పరిష్కారం, వైద్య సిబ్బంది కర్నూలు నుంచి రాకపోకలు సాగించకుండా నంద్యాలలోనే ఉంటూ వైద్యశాలలో నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పైన పేర్కొన్న సమస్యలన్నింటిపై ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు స్పందనలో ఫిర్యాదు చేశారు. అందుకు స్పందించిన వైద్యశాల సూపరింటెండెంట్ ఆర్ఎమ్‌వో, ఏఆర్ఎంవో, డాక్టర్స్ జిల్లా ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులతో చర్చించి సమస్యలన్నిటిని తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వారు పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు.

బొగ్గులైన్ వాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ

విశాలాంధ్ర - నంద్యాల : అధికార వైసీపీ ప్రజలను మభ్యపెట్టే పార్టీకాదని మాటిస్తే మాటకు కట్టుబడి నిలిచే పార్టీ అని నిరూపించామని ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని బొగ్గులైన్ వాసులు గత 40 ఏళ్ల కల నేడు నెరవేర్చామని, వారందరికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. బుధవారం నంద్యాల పట్టణం కుందూ నది సమీపంలో పేదలందరికి నవరత్నాలు పథకంలో భాగంగా అర్హులైన అందరికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇళ్లపట్టాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష చేతుల మీదుగా పేదలందరికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, ఎమ్మార్వో శ్రీనివాసులు, ఎలక్ట్రికల్ ఈఈ రమణారెడ్డి, కౌన్సిలర్లు, చంద్రశేఖర్, అనురాధ, వైసీపీ నాయకులు దేశం సుధాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి మునయ్య, అనిల్ అమృతరాజ్, మాభాష అధికారులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలను పునఃప్రారంభించాలి

సీఆర్టీ ఉపాధ్యాయుల ఆరు నెలల బకాయి జీతాలను వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర- ఆత్మకూరు రూరల్ : గిరిజన ఉపాధ్యాయ సంఘం, గిరిజన ఉద్యోగులసంక్షేమ సంఘం జిల్లాఅధ్యక్షులు జవహర్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రుద్రకోడూరు చెంచుగూడెంలోని ఆశ్రమపాఠశాల మరియు కొత్తపల్లి మండలంలోని జనాల చెంచుగూడెంలోని ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక పాఠశాలలను మూత వేయడం జరిగిందన్నారు.తక్షణమే ఆయాపాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి పునఃప్రారంభించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సీఆర్టీ ఉపాధ్యాయు లకు 6 నెలలుగా జీతాలు చెల్లించలేదని తక్షణమే జీతాలు చెల్లించాలని జవహర్ నాయక్ అధికారులను కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుపెట్టి గిరిజన విద్యార్థుల విద్యా అభివృద్ధి కోసం ప్రతి చెంచుగూడెంలో ఆశ్రమ పాఠశాలలను నిర్మిస్తే అధికారులు ఉపాధ్యాయులను నియమించక పోవడంతో రుద్రకోడూరు చెంచుగూడెం, కొత్తపల్లి మండలంలోని జానాల చెంచుగూడెంలోని ఆశ్రమ పాఠశాల మూతపడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని పునఃప్రారంభించాలని, కర్నూలు నంద్యాల ఉమ్మడిజిల్లాలో 19 ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీ ఉపాధ్యాయులు 75 మంది పనిచేస్తున్నారని గుర్తు చేశారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ ఉపాధ్యాయులకు ఆరు నెలలుగా జీతాలు ముట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువులు కుటుంబ పోషణ భారమై ఆ ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు పడు తున్నారని వెంటనే వారికి జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో త్వరలో నంద్యాల డీటీడబ్ల్యూవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని జవహర్ నాయక్ హెచ్చరించారు.

వేడుకలకు బీసీకి ఆహ్వానం

విశాలాంధ్ర- బనగానపల్లె: సాయిబాబా మందిర రథోత్సవ వేడుకలకు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు బుధవారం కలిసి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కార్యాలయంలో పట్టణం శివారులోని అవుకు రహదారిలో సాయిబాబా మందిరాన్ని నిర్మించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న ఆదివారం సాయిబాబా మందిరంలో రజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ మేరకు కమిటీ సభ్యులు బీసీ రాజారెడ్డిని కలిసి రజతోత్సవ వేడుకలకు హాజరు కావాలని కోరినట్లు వారు తెలిపారు.

జనసేన పార్టీతోనే కొనసాగుతా..!

విశాలాంధ్ర-నంద్యాల రూరల్: నాకు ఊపిరి ఉన్నంత వరకు జనసేన పార్టీతోనే ఉంటానని జనసేన నంద్యాల నాయకులు సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన జనసేన పార్టీ ఏర్పాటు నుండి పార్టీలోనే కొనసాగుతున్న అన్నారు. రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో జనసేనను వీడి, వేరే పార్టీలోకి మారుతున్నట్లు వస్తున్న ఫేక్ వార్తలను ఖండించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా నాఇంటి మీద జనసేన జండా, నాఒంటిమీద జనసేన కండువా ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.జనసేనపార్టీని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.ఇలాంటివి పవన్ అభిమానులు, కార్యకర్తలు నమ్మ వద్దని విజ్ఞప్తి చేశారు.ఈసమావేశంలో మద్దిలేటి, వెంకట్‌లు పాల్గొన్నారు.

బీరవోలులో అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-బనగానపల్లె: మండల పరిధిలోని బీరవోలులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పలు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. అందులో భాగంగా రూ.31.89 లక్షలతో నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు, పైపు లైను, రూ.13 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం, రూ.5 లక్షలతో నూతన పైపులైను, రూ.15 లక్షలతో పాఠశాల ప్రహరిగోడ ప్రారంబించారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి శేషిరెడ్డి, జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి శివరామయ్య,తదితరలు పాల్గొన్నారు.

వాహనాల వేలంపాట

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్రవాహనాలను పోలీసులు బుధవారం వేలంపాట నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోవెలకుంట్ల సీఐ రామానుజులు, ఎస్సై రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టుబడ్డ 5 ద్విచక్రవాహనాలను వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో పలువురు ఔత్సాహికులు పాల్గొన్నారు. రుద్రవరం పోలీస్‌స్టేషన్‌లో ఒక్క ద్విచక్ర వాహనాన్ని కలుపు కొని మొత్తం ఆరు వాహనాలకు రు1,96,650 ఆదాయం సర్కిల్ పరిధిలో వచ్చినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు అద్దాలు పంపిణీ

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో చేపట్టిన వైద్య శిబిరాల్లో పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారిణి అపర్ణ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9 మంది, మోడల్ స్కూల్‌లో 32 మంది, కొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 మంది విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించి వారికి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు రమేష్, హెల్త్ సూపర్వైజర్ రామచంద్రుడు, దస్తగిరి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి, అధ్యాపక, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అంగన్‌వాడి కేంద్రానికి కుర్చీల విరాళం

విశాలాంధ్ర - బేతంచెర్ల : మండల కేంద్రమైన బేతంచెర్ల లోని 14వ అంగన్ వాడి కేంద్రానికి లయన్స్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ టేబుల్, కుర్చీలను విరాళంగా అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. ఈ సెంటర్‌లో పనిచేస్తున్న టీచర్ రాధ తమ సెంటర్‌కు కుర్చీలను విరాళం గా ఇవ్వాలని కోరగా బుధవారం ధనుంజయ దంపతుల పెళ్ళిరోజును పురస్కరించుకుని వాటిని విరాళంగా అందజేశారు. కుర్చీలను విరాళం గా అందజేసి, పిల్లలకు బిస్కెట్లును పంపిణీ చేశారు.వారికి టీచర్ రాధ కృతజ్ఞతలు తెలిపారు.లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కే.సతీష్ కుమార్, జిల్లా చైర్మన్ ఎం.విష్ణు మోహన్, ట్రెజరర్ కే.మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర - చాగలమర్రి : స్థానిక మల్లెవేముల బస్టాండు సమీపంలోని శాఖా గ్రంధాలయంలో వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం పుస్తక ప్రదర్శన చేసారు.గ్రంధాలయ పరధిలోని వివిధ రకాల పుస్తకాలను పాఠకులకు ప్రదర్శన నిమిత్తం ఉంచి వాటి గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సిబ్బంది లాలయ్య, పాఠకులు పాల్గొన్నారు.

పటిష్ట భద్రతతో మల్లన్న హుండి లెక్కింపు

రక్షణనిధికి విరాళం

బంగారు హారం విరాళం

విశాలాంధ్ర- శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలం మహాక్షేత్రంలో శ్రీ భ్రమరాంబ మల్లి కార్జున స్వామివార్లకు 34రోజుల నుండి భక్తులు సమర్పించిన కానుకలు బుధవారం లెక్కించారు. ఈలెక్కింపులో రూ.3,57,88,078 రూపాయల నగదు, 649 యూఎస్ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 50 మలేషియా రింగేట్స్ 70 కెనడా డాలర్లు, 50 యూఏఈ దిర్హమ్స్,440 ఆస్ట్రేలియా డాలర్లు మొదలైన విదేశీకరెన్సీ కూడా స్వామి అమ్మవార్లకు రాబడిగా లభించాయి. పటిష్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘా మధ్యన ఈ లెక్కింపు నిర్వహించినట్లు ఈవో డి పెద్దిరాజు తెలిపారు.

రక్షణనిధికి విరాళం:

శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల గో - సంరక్షణ పథకానికి సంగారెడ్డి జిల్లాకు చెందిన సి.రాములు రూ.1,00,116 విరాళంగా అందించారు. ఈవిరాళాన్ని ఆలయ అధికారులు స్వీకరించి విరాళానికి సంబంధించిన రసీదుతో స్వామిఅమ్మవార్ల లడ్డుప్రసాదాలు దాతకు అందజేసి ప్రోత్సహించారు.

బంగారు హారం విరాళం

శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు హైదరాబాద్‌కు చెందిన జిశ్రీరాములు రాజేశ్వరి 29 గ్రాముల బంగారు హారాన్ని విరాళంగా అందించారు. ఈ విరాళం ఆలయ అధికారులు స్వీకరించి అందుకు సంబంధించిన రసీదుతోపాటు స్వామి అమ్మవార్ల ప్రసాదమందించి దాతను ప్రోత్సహించారు.

జమిందార్ కాఫీ కేఫ్ ప్రారంభం

విశాలాంధ్ర -ఆత్మకూరు టౌన్: పట్టణంలోని లారీ ఓనర్ అసోసియేషన్ ప్రక్కననూతన జమిందార్ కాఫీ కేఫ్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆసియా, ఆత్మకూరుటౌన్ పార్టీ అధ్యక్షులు సయ్యద్‌మీర్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బీసీ..ఆలయ నిర్మాణానికివిరాళం అందజేత

విశాలాంధ్ర - బనగానపల్లె : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలుకూరులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి పదిలక్షలు రూపాయలు విరాళం అందజేశారు. గ్రామ ప్రజలు నూతన గుడి కొరకు బీసీ జనార్దన్‌రెడ్డిని సహాయం కోరగా తక్షణమే రూ.10 లక్షలు అందించి సమాజ శ్రేయస్సు కొరకు సహాయ సహకారాలు అందించడంలో తనకు సాటి మరొకరు లేరని నిరూపించుకున్నారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పలుకూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర -డోన్ రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హనీఫ్ తెలిపారు. ముఖ్యంగా వయసు మళ్ళినవారు, చిన్న పిల్లలకు వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండడంతో వారి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలకు దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ, విరేచనాలు వంటి వాటికి డాక్టర్లను సంప్రదించి తగు వైద్యం తీసుకోవాలన్నారు. సొంత వైద్యం, నాటు వైద్యం లాంటి వాటితో ఇబ్బందులు వస్తాయని అన్నారు. చంటి పిల్లలకు కాచి వడబోసిన నీటిని తాగించడం మంచిదని తెలిపారు.

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టాలను తమ చేతిలోకి తీసుకోవడం, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కోవెలకుంట్ల సీఐ రామానుజులు హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రమేష్‌రెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.హక్కు ఉంది కదా అని ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించ వద్దన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలను ఎవరు ప్రోత్సహించ వద్దని ప్రతి ఒక్కరు శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర- పాణ్యం : నంద్యాల జిల్లా బాస్కెట్బాల్ పురుషులు మహిళలు జట్లకు బుధవారం జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగ్గారి రమణా రెడ్డి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కళాశాలలో బుధవారం జిల్లా బాస్కెట్బాల్ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మిద్దె శివరాం మాట్లాడుతూ జిల్లా జట్టు క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో కలిసికట్టుగా ఆడి విజయం విసాధించాలని కోరారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీ తోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఉమ్మాయిపల్లి, ఉమ్మాయిపల్లి తండా గ్రామాల్లో 'బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ'లో ఆయన పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఆయన ఇంటింటికెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకొని టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసేలా ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ బీసీ కరపత్రాలు అందించారు.

సీఎం..నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేశాడు..మాండ్ర శివానందరెడ్డి

విశాలాంధ్ర-జూపాడుబంగ్లా: నవరత్నాల పేరుతో ప్రజలను జగన్మోహన్ రెడ్డి మోసం చేస్తున్నారని నంద్యాల పార్లమెంటు తెలుగుదేశం ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి విమర్శించారు. మండలంలోని తాటిపాడు గ్రామంలో బుధవారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ గ్రామ నాయకులు వీరారెడ్డి ,లక్ష్మణ్ గౌడ్, గోరసాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాభివృద్ధి శూన్యమన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హాయంలో అనేక విధాలుగా గ్రామాలు అభివృద్ధి చేశామని వారన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రోడ్లు ,డ్రైనేజీ కాలువలు కనీస సౌకర్యాల్లేక వాటిని గురించి పట్టించు కునే నాధుడే లేడన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితి తీవ్రంగా ఉన్న రైతులను పట్టించుకోవడం లేదన్నారు.సీఎం జగన్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో ఏఒక్కటి సక్రమంగా ప్రజలకు నెరవేర్చలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలలో వ్యతిరేకత ఏర్పడిందని. 2024ఎన్నికల్లో ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ది చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు ప్రతి సామాజిక వర్గానికి అందేలా చేసే బాధ్యత చంద్రబాబు నాయుడు అని వారు తెలిపారు. టీడీపీ మేనిఫెస్టోలోనివన్నీ ప్రజలందరూ గమనించి 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించి ప్రతి ఒక్కరు ఓటు వేసి వేయించి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రినిచేయాలని ప్రజలకు తెలియజేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను గ్రామంలో తిరుగుతూ ప్రజలకు చదివి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్, నంద్యాల పార్లమెంట్ అబ్జర్వర్ గిరీశ్వర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మందడి నారాయణరెడ్డి, జయ సూర్య, నాగముని, సంపత్‌కుమార్ యాదవ్, రవికుమార్ యాదవ, సుధాకర్, సుబ్బన్న, షాలు, గ్రామ ప్రజలకు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఇంటింటికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-నందికొట్కూరు: అధికార వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఇంటింటికి సంక్షేమ పథ కాలు అందించడం జరుగుతుందని వైసీపీ మండల అధ్యక్షులు రవియాదవ్ అన్నారు. బుధవారం ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో ఇంటిటి ప్రచార కార్యక్రమాన్ని మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరులో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులు నందికొట్కూరు వైసీపీ మండల అధ్యక్షులు రవియాదవ్, ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఏపీకి జగన్నన్నే ఎందుకు కావాలంటే అనే విషయంపై గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించారు. పార్టీ సీనియర్ నాయకులు, జడ్‌పీటీసీ కలిమున్నిసా,నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ రాహేత్ జబ్బార్, బ్రాహ్మణ కొట్కూరు సింగిల్‌విండో చైర్మన్ మద్దూరు సతీష్ రెడ్డి, నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ లక్ష్మి కాంతరెడ్డి, బ్రాహ్మణకొట్కూరు శివారెడ్డి, అశోక్ రెడ్డి, బైరెడ్డి శ్రీధర్ రెడ్డి, సుబ్బన, మండల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తెలంగాణ ప్రభుత్వం కోసం పనిచేస్తుంది

రైతుల విషయంలో రాజకీయాలు చేస్తే ఊరుకోం..!

కేసీకి మరో రెండు రోజుల పాటు అధనంగా నీరు..!!

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల కోసం కాకుండా తెలంగాణ ప్రభుత్వం కోసం పనిచేస్తున్నట్లుగా ఉందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు.బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నుంచి తెలంగాణ ప్రభుత్వం కీలకమైన ఈ సమయంలో వేలాది క్యూసెక్కుల నీటిని దిగువకు తరలిస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కనీసం అడ్డుచెప్పడం లేదన్నారు. ఇక్కడ ఎండిపోతున్న పంట లను రక్షించుకునేందుకు నీళ్లు లేకున్నా తెలంగాణ ప్రభుత్వం మాత్రం విద్యుత్ కోసం శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేస్తున్నారన్నారు. కేసీ కెనాల్‌కు 3.8 టీ ఎంసీల తుంగభద్ర నీరు వాడే హక్కు ఉన్న నీళ్లు లేవని మన ప్రాంత ప్రజా ప్రతినిధులు ఎలా చెబుతున్నారని ఆమె ప్రశ్నించారు. ఓవైపు నీరు లేక పంటలు ఎండిపోతుంటే మరోవైపు హక్కుగా ఉన్న కేసీ నీటి వాట వినియోగంలో సత్వర నిర్ణయం తీసుకోకపోవడం ఎంతవరకు సబబన్నారు. రైతుల సమస్యలను రాజకీయంగా చూడవద్దని ఆమె కోరారు. జిల్లా కలెక్టర్ దృష్టికి ఐదు రోజుల పాటు కేసీకి ఇస్తే నీరు సరిపోవని చెప్పామని ఆయన దృష్టికి తెచ్చామన్నారు. 3.8 టీఎంసీల నీళ్లు తుంగభద్ర ద్వారా మనం వాడుకోవచ్చని ఆ హక్కు మనకు ఉందని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఆయన వెంటనే స్పందించి తప్పకుండా సహాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. మా సమస్యలు విని అధనంగా రెండు రోజుల పాటు కేసీకి నీరు వదిలేందుకు నిర్ణయం తీసుకున్న కలెక్టర్‌కు రైతులతో పాటు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. కేసీ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఎం కానీ, జిల్లా మంత్రులను కలసి కేసీకి నీరు అందించే ప్రయత్నం చేస్తామని అఖిలప్రియ భరోసా ఇచ్చారు. రైతుల కోసం వారం రోజులుగా మేము ఉద్యమిస్తు రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే ఆయన వెంటనే స్పందించి కె.సి కెనాల్ కు సాగునీటి విడుదల చేశారని ఇప్పుడు ఇస్తున్న ఐదు రోజులు కాకుండా మరో రెండు రోజులు అధనంగా ఇస్తామని నిర్ణయం తీసుకున్నారు. కానీ అది మేమే చేశామని వైసీపీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. రైతుల బాగోగుల కోసం ఏలాంటి త్యాగానికైనా సిద్ధమేనని మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ స్పష్టం చేశారు.

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, గురువారం 16,నవంబర్ 2023

జిల్లా కలెక్టర్లకు భూ సమస్యల వెల్లువ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణం వెలుగు కార్యాలయం భవనంలో గురువారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో భూ సమస్యలపై భారీగా ఫిర్యాదులు వచ్చాయి.జిల్లా కలెక్టర్ సృజన ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు మండలంలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో మొరపెట్టుకున్నారు.ఎక్కువగా భూ సమస్యలు పరిష్కరించాలని, తమ పొలాలను ఆన్లైన్లో చేర్చాలని, భూ సర్వేలో తమ పొలం తక్కువగా ఆన్లైన్ చేశారని, ప్రభుత్వ పట్టా స్థలాన్ని ఆక్రమించారని పలు ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గూడూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన మహిళలు తమ అనుభవంలో ఉన్న స్థలాన్ని అధికారులు లాక్కున్నారని మరల అదే స్థలాన్ని కేటాయించాలని కన్నీటితో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. చనుగొండ్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని గ్రామ ప్రజలు ఫిర్యాదు చేశారు గూడూరు నగర పంచాయతీ చైర్మన్ జూలపాల వెంకటేశ్వర్లు,వైస్ చైర్మన్ అస్లాం, మాజీ జెడ్పిటిసి ఎల్ వెంకటేశ్వర్లు, స్థానిక కౌన్సిలర్లు నేతలు జిల్లా కలెక్టర్ మరియు జెసిలను సన్మానించారు. అనంతరం మునగాల ఎత్తిపోతల పథకం పైప్ లైన్ మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డిఓ హరిప్రసాద్, జడ్పిటిసి మౌలాలి, ఎంపీపీ సునీత, తాసిల్దార్ వెంకటరమణ, మరియు జిల్లా అధికారులు ఎస్సై వీరయ్య పాల్గొన్నారు.

మునగ సాగుతో.. మెరుగైన ఉపాధి

▶▶జిల్లాలో 236 మంది రైతులకు చెందిన 245 ఎకరాల్లో మునగ సాగు

▶▶ఉపాధి హామీతో లాభాలు గడిస్తున్న రైతులు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కష్టాల కడలిలో కొట్టు మిట్టాడుతున్న రైతులు.. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ అండతో.. వివిధ రకాల ఉద్యాన పంటలను సాగు చేస్తూ.. పండ్ల తోటల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. ఆత్మస్థైర్యంతో అడుగిడుతున్న సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం.సత్ఫలితాలను ఇస్తోంది. మునగ సాగు ద్వారా.. వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు.. మరికొందరికి ఉపాధి అవకాశాలను కుడా కల్పిస్తున్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్దేశం ప్రకారం జాబ్ కార్డు కలిగిన గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పని కల్పనతో పాటు. వ్యక్తిగత ఉమ్మడి ఆస్తుల ఏర్పాటులో భాగంగా చేపట్టిన పనులు కేటగిరి "బి"కి సంబంధించి.. వ్యక్తిగత ఆస్తుల అభివృద్ధి చేసేందుకు గాను ఉపాధి హామీ పనులను వ్యవసాయ పనులకు అనుసందానం చేయడమైనది. ఈ పనుల్లో భాగంగా 5 ఎకరాల లోపు భూమి కల్గిన రైతులకు మరియు దుర్భలమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతు కుటుంబాలకు మునగ తోటల పెంపకం చేపట్టి సుస్థిర ఆదాయ మార్గాల ద్వారా వారు జీవనోపాధి పొందుటకు ఈ పథకాన్ని వర్తింప చేయడం జరుగుతుంది. లాభాలబాటలో మునగసాగు.... 2023 - 2024 ఆర్థిక సంత్సరానికి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం క్రింద 236 మంది రైతులు, 245 ఎకరాల్లో మునగ తోటలు సాగు చేస్తున్నారు.వ్యవసాయ పంటలకంటే ఉద్యాన పంటల్లో సాగు పెట్టుబడులు, యాజమాన్య ఖర్చులు తక్కువ కావడంతో.. రైతులు కూడా అమితంగా ఆసక్తి చూపుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అందిస్తున్న ఉపాధి పనులు, రాయితీలు రైతులకు మరింత లాభదాయకంగా మారాయి. దీంతో గ్రామీణ రైతులు, రైతు కూలీలు ఉపాధి హామీ పథకంలో అనుసంధానం చేయబడిన ఉద్యాన పంటల సాగుకు మొగ్గుచూపుతూ.. ఉన్న ఊరులోనే చక్కటి ఉపాధి పొందుతున్నారు.

మునగ సాగుతో లాభాలు.... రైతు వెంకటేశ్వర్లు

ఓర్వకల్లు మండలం, బ్రాహ్మణపల్లి గ్రామం జాబ్ కార్డు హోల్డర్ రైతు కే. వెంకటేశ్వర్లు, ఉల్లి, కంది, శనగ, పంటలు సాగు చేసి దిగుబడులు కూడా సరిగా రాక నష్టాలు చవిచూసే వాళ్లమని ఉపాధి హామీ పథకం అధికారుల సూచనలు సలహాల మేరకు ఈ ఏడాది ఒక ఎకరా పొలంలో ఉపాధి హామీ పథకం సహకారముతో మునగ పంటను సాగు చేశానన్నారు.రాజమండ్రి నుంచి పీకెఎం . 1.అనే రకం మునగ మొక్కలు 440 ఒక ఎకరా విస్తీర్ణములో నాటడం జరిగిందన్నారు. మొక్కలపై ప్రత్యేక దృష్టి పెట్టి శ్రద్ధతో ఎరువులు, మందులు సకాలంలో వేస్తూ నీటిని క్రమము తప్పకుండా పెట్టడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి, 5 నెలలలోనే పంట చేతికి వచ్చింది. మొక్కలు నాటుకొనుటకు ఉపాధి హామీ పథకం ద్వారా సహకారం అందింది అన్నారు. 30 వేల రూపాయలు ఖర్చు చేసి సస్యరక్షణ మందులను వాడటం చేత పంట విరిగా కాయడంతో అధిక దిగుబడి వస్తుందని అన్నారు. ప్రస్తుతం కేజీ 130 రూపాయల నుండి 150 రూపాయల వరకు ధర పలికి అధిక లాభాలు వచ్చాయన్నారు ఎకరా కు ఖర్చులు పోను దాదా రూ1,50,000/- ఆదాయం వస్తుందన్నారు.

తెలంగాణ సరిహద్దులో ఉన్న మద్యం షాపులు బంద్

జిల్లా కలెక్టర్ డా.జి.సృజన

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు :తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులో ఉన్న మద్యం షాపులు మూసివేయాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం 1968 సెక్షన్ 20(1) కింద తెలంగాణ రాష్ట్ర సరిహద్దు నుండి 5 కిలోమీటర్లలో పులో కర్నూలు జిల్లాలో ఉన్న అన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెవరేజ్స్ కార్పొరేషన్ లిమిటెడ్ వైన్ షాపులు,2బి బార్లు,కల్లు షాపులు28 సాయంత్రం 5 గంటల నుండి 30సాయంత్రం 5గంటల వరకు, కౌంటింగ్ తేదీ 03న మూసివేయాలని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పుస్తక ప్రాముఖ్యత,మాదకద్రవ్యాలపై అవగాహన

విశాలాంధ్ర - సి బెళగల్: పుస్తక ప్రదర్శన మరియు పుస్తక ప్రాముఖ్యత అలాగే మారకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమము మరియు ర్యాలీ నిర్వహించారు. బుధవారం మండల కేంద్రమైన సి.బెళగల్లోని గ్రంథాలయ భవనంలో 56వ వార్షికోత్సవాల్లో భాగంగా ముఖ్య అతిథిగా ఈవోఆర్డీ సందీప్ హాజరై పుస్తక ప్రదర్శన మరియు పుస్తక ప్రాముఖ్యత అలాగే మార్గద్రవ్యాలపై అవగాహన వంటి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వినాయక డిగ్రీ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొని గ్రంథాలయ భవనం నుండి సి.బెళగల్ బస్టాండ్ వరకు గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈ ఓ ఆర్ డి సందీప్ మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక ప్రదర్శన గురించి అలాగే పుస్తక ప్రాముఖ్యత మరియు మారకద్రవ్యాలపై విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్ డి సందీప్ తో పాటు లైబ్రేరియన్ వెంకటరమణ, ఎంఈఓ జ్యోతి వినాయక డిగ్రీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

విశాలాంధ్ర - కర్నూలు : శ్రీ భాగ్ ఒడంబడికను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, రాయలసీమ ప్రాంత ప్రజల న్యాయమైన హక్కులను పట్టించుకోని ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తూ రాయలసీమ ప్రజా సంఘాల సమన్వయ వేదిక కర్నూలు ఆధ్వర్యంలో నవంబర్ 16న గురువారం సాయంత్రం 5 గంటలకు కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ అరుణ్,కో కన్వీనర్ భాస్కర్రెడ్డి తెలిపారు. విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాయలసీలలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన చీకటి ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీమ బిడ్డలందరూ నిరసన కార్యక్రమానికి హాజరై మన హక్కుల కోసం పోరాడాలని కోరారు.

వందలాది లీటర్ల అక్రమసార ధ్వంసం

విశాలాంధ్ర - హొళగుంద : హొలగుంద పోలీస్ స్టేషన్ పరిధి లో, అనుమతి లేకుండా,గతంలో అమ్ముతున్నటువంటి కర్ణాటక లిక్కర్ను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్సై వి శ్రీనివాసులు తెలిపారు. కర్నూలు ఎస్పీ ఉత్తర్వుల మేరకు, పత్తికొండ డిఎస్పి శ్రీ పి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో మరియు ఆలూరు సీఐ బి వెంకటేశ్వర్లు సమక్షంలో, హొళగుంద ఎస్సై వి శ్రీనివాసులు మరియు సిబ్బంది కలిసి,బుధవారం చిన్నహ్యాట రోడ్ లో,సుమారు రూ.2,20,000 విలువచేసే 5700 కర్ణాటక లిక్కర్ పాకెట్స్ ను ధ్వంసం చేశారు.

ఉచిత విద్యుత్ రద్దు చేయడం ఆపాలి

విశాలాంధ్ర - ఆదోని : కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల ఎస్సి ఎస్టీ ప్రజలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కపట ప్రేమ ఒలకబోస్తున్నారని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ చైర్మన్ మారుతి రావు విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో ఎస్సి ఎస్టీలకు ఉచిత విద్యుత్ రద్దు చేస్తూ సాధారణ సర్వీసులగా మార్పు చేయడంపై వారు మండి పడ్డారు. ఎస్సి ఎస్టీల ఓట్లు వేయించుకుని నేడు ఉచిత పథకాలకు అనర్హులుగా చేయడం మాట ఇచ్చి మడమ తిప్పడం అంటే ఇదే అని గుర్తుచేశారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, డోన్ డివిజన్ పరిధిలో ఏకంగా పది వేల ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఎత్తివేయడం సిగ్గు చేటన్నారు. దళిత కాలనీల్లో నివసించే వారికే మాత్రమే వర్తింపచేయడం సబబు కాదన్నారు. జగనన్న కాలనీల్లో సైతం వర్తింప చేయని ఉచిత విద్యుత్ పథకం, జగనన్న కాలనీల్లో 3వెలకు పైగా లబ్ధిదారులకు మంగళ పెట్టిన జిల్లా అధికారులు, ఎస్సి ఎస్టీలను ఉద్ధరిస్తున్నట్టు ప్రగల్భాలు పలుకుతున్న జగన్ మోహన్ రెడ్డి మాయ మాటలు రాష్ట్ర దళిత ప్రజలు గమనించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యనిర్వహన అధ్యక్షుడు దిలీప్ ధోక, ఆదోని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దేవిశెట్టి వీరేశ్ , పట్టణ కార్యదర్శి సాయినాథ్, గిరిజన నాయకుడు సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర - ఆస్పరి : ప్రతిఒక్కరూ పుస్తక పఠాన్ని అలవాటుగా మార్చుకోవాలని గ్రంథాలయ అధికారి విశ్వనాథ్ రెడ్డి, నోబుల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్లు అన్నారు. 56వ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తక భాండాగారాన్ని నిరుద్యోగ యువత, విద్యార్థులు ఉపయోగించుకుని జ్ఞానాన్ని ఆర్జించాలని అలాగే చిన్నతనం నుంచే సెల్ఫోన్లకు అలవాటు పడకుండా పుస్తకాలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అప్పుడే వివిధ కాంపిటీషన్ ఎగ్జామ్స్ లో పాల్గొనే నిరుద్యోగ యువతకు విద్యార్థులకు మేలు చేకూరుతుందన్నారు. గ్రంథాలయాల్లో నిక్షిప్తమై ఉన్న పుస్తకాల్లో అపారమైన మేధస్సు దాగి ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్క విద్యార్థీ పుస్తకాలను చదువుకునేందుకు గ్రంథాలయాలకు వెళ్లాలని సూచించారు. ఈ పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, మేజర్ పంచాయితీ వార్డు మెంబర్ అలీ భాష, పాఠకులు యుగంధర్, రామకృష్ణ,శివ,రంగస్వామి,గోవిందు,విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల పున:పంపిణీ ఆంధ్రప్రదేశ్ కు తీరని నష్టం

విశాలాంధ్ర-పత్తికొండ: కృష్ణా జలాల పున:పంపిణీ నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్ కు తీరని నష్టం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో విజయవాడలో జరిగే 30 గంటల నిరాహార దీక్ష గోడపత్రికలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం కృష్ణా జలాల పున : పంపిణీ పై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ కు తీరని నష్టం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమకేమీ పట్టనట్లు వ్యవహరించడాన్ని తప్పు పట్టారు. రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కరువు సహాయక చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాలలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి, మిగిలిన మండలాలను కూడా కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20,21, తేదీలలో కృష్ణా జలాల పున: పంపిణీ గెజిట్ నోటిఫికేషన్ కు వ్యతిరేకంగా విజయవాడలో జరిగే 30 గంటల నిరాహార దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు,జిల్లా సమితి సభ్యులు గురుదాస్, మండల సహాయ కార్యదర్శి రంగన్న,ప్రజా సంఘాల నాయకులు నాగరాజు, నరసింహులు,నాగిరెడ్డి, కౌలుట్ల తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష గోడపత్రికలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కరువు మండలాలలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - ఆదోని : రాష్ట్రవ్యాప్తంగా 400 మండలాలలో కరువు పరిస్థితులు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం దారుణమని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య విమర్శించారు. బుదవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ పట్టణ, మండల సమితి సభ్యుల సమావేశం పట్టణ కార్యదర్శి సుదర్శన్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, కరువు మండలాలుగా ప్రకటించిన మండలాలలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి వలసలు నివారించాలని డిమాండ్ చేశారు. తుగ్గలి మండలంలో కరువు మండలంగా ప్రకటించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు.కరువు నుంచి నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని, రైతుల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని,బ్యాంకులలో రైతులకు కొత్త రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. జిల్లాలో వలసలు నివారించి ఉపాధి హామీ పనులు చేపట్టాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉన్న కృష్ణా జిల్లాల పునర్ పంపిణీ పై గజిట్ నోటిఫికేషన్ కు వ్యతిరేకంగా రాష్ట్రంలో కరువు పరిస్థితులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, ఈనెల 20, 21వ తేదీలలో విజయవాడలో 30 గంటల నిరసన దీక్ష చేస్తామని, జరగబోయే దీక్షకు రైతులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు దారుణంగా ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మండలాల్లో కరువు తాండవిస్తుంటే కేవలం 13 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని విమర్శించారు జగన్ ప్రభుత్వం కరువు పై కేంద్రానికి నివేదిక పంపించలేదని, రాష్ట్రంలో పర్యటించి కరువు అంచనా వేసేందుకు కేంద్ర బృందాలను ఆహ్వానించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయకట్టు ప్రాంతాలలోనూ సాగునీరు లేక లక్షలాది ఎకరాలు బీడు భూములుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు తీవ్రంగా నష్టపోయారని పంటలు వేసి నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టపరారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రైతు రుణాలు మాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర బంద్ కు కూడా పిలుపునిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వైటి భీమేష్ కుమారస్వామి పట్టణ సహాయ కార్యదర్శి లు హర్షత్ కుమారస్వామి కొత్తూరు గంగన్న మెకానిక్ వలి ప్రకాష్ ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి గిరి మల్లప్ప పార్టీ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

అధికారుల జాడేదీ...!

విశాలాంధ్ర - దేవనకొండ : దేవనకొండ ఎంపీడీవో కార్యాలయంలోనా అధికారుల కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మాదే ఆఫీసు మా ఇష్టం వచ్చిన సమయానికి మేము వెళ్తాం మమ్మల్ని ఎవరేం చేయలేరులే అనే ధీమాతో ఉదయం 11 అవుతున్నా కూడా ప్రభుత్వ కార్యాలయానికి ఉద్యోగులు రాని సంఘటన బుధవారం దేవనకొండ పట్టణంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాల్సిన అధికారులు ఉదయం 11 గంటల వరకు కూడా వారి జాడ కానరాక పాయే. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు సమయపాలనతోపాటు తమ విధులను సక్రమంగా నెరవేరుస్తున్నారు. ఇది అందరికి తెలిసిన అయితే ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం సమయపాలన పాటించకుండగా విధులకు హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.ప్రభుత్వ కార్యాలయమే కదా తమ ఇష్టం వచ్చిన సమయానికి రావచ్చన్న ధీమాతో ఉద్యోగులు వ్యవహరించడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 సమయములో ఖాళీగా కుర్చీలు దర్శనమిచ్చాయి. అధికారులు కార్యాలయంకు రాకపోవడంతో అవసరాల కోసం వచ్చిన ప్రజలు కార్యాలయం ముందు కూర్చుని వేచి చూడడం తప్ప పని జరగటం లేదు అని ప్రజలు ఆరోపిస్తున్నారు.సమయపాలన పాటించని అధికారులపై జిల్లా కలెక్టర్ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న ఎంపిడిఓ కార్యాలయంలోని అధికారుల కుర్చీలు

నిరాహార దీక్షను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్న కృష్ణ జలాల పంపిణీ పై గెజిట్ నోటిఫికేషన్ కు వ్యతిరేకంగా రాష్ట్రంలో కరువు పరిస్థితులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ఈనెల 20 ,21వ తేదీలలో సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే 30 గంటల నిరాహార దీక్షను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం తాలూకా కార్యదర్శి ఆంజనేయ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక బస్టాండ్ ఆవరణంలో గోడపత్రికలను విడుదల చేయడం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు దారుణంగా ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఎన్నో పోరాటాలు చేసినప్పటికీ జిల్లా మొత్తం కరువు ప్రకటించకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు .జిల్లాలో మిగిలిన మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ నిధులు కేటాయించలేకపోవడం అంటే చాలా సిగ్గుచేటు అన్నారు. తక్షణమే కర్నూలు జిల్లా రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసప్ప, ఆంజనేయ, నాగరాజు, హుసేని, రంగస్వామి, భాష, బసవరాజు, నాగేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

విశాలాంధ్ర - కోసిగి : ముఖ్యమంత్రిజగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందివ్వడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు.స్థానిక 5వ సచివాలయం నందు బుధవారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంకు మండల జేసియస్ ఇంచార్జ్ పి మురళీమోహన్ రెడ్డి తో కలిసి గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బీరప్ప దేవాలయం నందు అంగన్వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, భీమలింగమ్మ,దేవి,శైలజ,లతలు ఏర్పాటుచేసిన గర్భవతులకు శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు.గర్భవతులకుఅక్షింతలు వేసి దీవించి, జగనన్న అందిస్తున్న వైయస్సార్ సంపూర్ణ పోషకాహారం గూర్చి గర్భవతులను అడిగి తెలుసు కున్నారు.అలాగే కాలనీవాసుల కోరిక మేరకు బీరప్ప గుడి నుంచి రైల్వే ట్రాక్ వరకు సిసి రోడ్డు మంజూరు చేయడంతో పాటు డ్రైనేజీ కాలువకు అడ్డంగా కల్వర్టును నిర్మాణంకు హామీ ఇవ్వడం జరిగింది. ఈకార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు,మండల నాయకులు,వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

దేశంలోనే సంక్షేమానికి దిక్సూచి ఆంధ్రప్రదేశ్

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : దేశంలోనే సంక్షేమ ఫలాలకు దిక్సూచిగా ఉన్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల అధ్యక్షులు డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జడ్పిటిసి కే ఈ సుభాషిని, మండల కన్వీనర్ ఆర్ బి వెంకటరాముడు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామ సచివాలయంలో ముందుగా వివిధ సంక్షేమ పథకాల సంబంధించిన వాల్ బోర్డును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన వైయస్సార్సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ సంక్షేమంలోనూ, అభివృద్ధిలోనూ, పరిపాలనలోనూ దేశంలోనే ఏపీ దిక్సూచిగా మారిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడి సర్పంచ్ మా దేవమ్మ, వైస్ ఎంపీపీ రాజేష్ ,వైఎస్ఆర్సిపి నాయకులు భీమిరెడ్డి, లక్ష్మి కాంతారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సంగాల గిడ్డయ్య, హనుమంతు, కత్తి మద్దయ్య, జనార్ధన్ బాలవెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళ కుటుంబానికి అండగా ఉంటాం

విశాలాంధ్ర - కోడుమూరు : నిరుపేద మహిళ కుటుంబానికి అండగా ఉంటామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు దోని విజయభారతి అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో టీ కొట్టు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న రాజేశ్వరికి న్యాయం చేసి, జీవనోపాది కల్పించాలని కోరుతూ గ్రామ పంచాయితి కార్యాదర్శికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మహిళా సమాఖ్య నాయకురాల్లు విజయభారతి మాట్లదుతూ పాతబస్టాండు ప్రాంతంలోని పంచాయితీ కాంప్లెక్స్ మెట్ల పక్కనే దాదాపుగా 14 ఏళ్ళుగా అటగారి రాజేశ్వరి అనే నిరుపేద మహిళ కేవలం 2ఐ3 అడుగుల బల్లపై మాత్రమే టీ అమ్ముకొని జీవనం సాగిస్తుందన్నారు.పంచాయితీ కాంప్లెక్స్ నిర్మాణం కంటే ముందు నుంచే ఇక్కడ రాజేశ్వరి, నాగరాజులు టీ అమ్ముకొని జీవనం సాగించేవారని చెప్పారు. కుటుంబ బాధ్యతలు పట్టించుకోకుండా నాగరాజు పలాయనం చిత్తగిస్తే అప్పటి నుండి ఇద్దరి కూతుర్లతో పాటుగా తనకుగల మతిస్థిమితంలేని తమ్ముడు బాధ్యత కూడ రాజేశ్వరిపై పడిందన్నారు. కుటుంబానికి మగదిక్కు లేక, బంధువుల ఆదరణ కూడా లేకపోవడంతో గతంలోని సర్పంచులు ఆమె కుటుంబానికి అండగా నిలిచి,2ఐ3 అడుగుల స్థలాన్ని ఉచితంగానే కేటాయించినట్లు చెప్పారు.ఆ స్థలంలోనే చిన్న టేబుల్ పై టీ అమ్ముకుంటూ రాజేశ్వరి తన పెద్ద కూతురు వివాహం,చిన్న కూతురు బిఇడి వరకు విద్యను అందించేందుకు నాన్న కష్టాలు పడుతూ,అందిన కాడంతా అప్పులు చేసిందన్నారు.అప్పులతోపాటు వృద్దాప్యం తోడైన రాజేశ్వరి నిస్సాహాయతగా కాలం వెళ్లదీస్తున్న తరుణంలో ఆమెకు కేటాయించిన స్థలంలో 2ఐ3 అడుగుల బల్లపై ఉన్న టీ కొట్టును కూడ తొలగించిడం దారుణమన్నారు.అడుక్కోని వచ్చి తినేవారి ప్లేటులో అదికార్లు మన్ను చల్లినట్లుందని ఎద్దేవా చేశారు.నిరుపేద మహిళకు న్యాయం చేయాలని కోరారు. రాజేశ్వరి కుటుంబానికు న్యాయం జరిగే వరకు వారికి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి,హసీన, పార్వతమ్మ,సంధ్య,రేణుక తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

క్రీడా పోటీల లోగోను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - కర్నూల్ లీగల్ : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేటి నుండి 25వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమె డి.ఇ.ఓ. రంగారెడ్డి తో కలిసి రాష్ట్ర క్రీడా లోగోను ఆవిష్కరించారు. వివిధ జిల్లాల నుండి వచ్చే బాలబాలికలకు వసతి భోజనం వసతులను చక్కగా ఏర్పాటు చేయాలని ఆమె డి.ఈ.ఓ.కు సూచించారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ ఈనెల 16 నుండి 18 వరకు రాష్ట్రస్థాయి అండర్ 19 హ్యాండ్ బాల్ బాల బాలికల పోటీలు బి. క్యాంప్ క్రీడా మైదానంలో జరుగుతాయన్నారు. అలాగే 18 నుండి 20వ తేదీ వరకు అండర్ 14, 20 వ తేదీ నుండి 22వ తేదీ వరకు అండర్ 17, 21 నుండి 23వ తేదీ వరకు అండర్ 19 బాలబాలికల రగ్బీ ఛాంపియన్షిప్ ను ఆదర్శ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. అలాగే నగర శివారులోని మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి అండర్ 14, 17 బాల బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘాల కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, హెచ్.ఎం. డి.వి. సుబ్బారెడ్డి, అసిస్టెంట్ ఎస్. జి.ఎఫ్ సెక్రెటరీలు శేఖర్, ఎం.ఎం.డి.బాషా, పి.డి.లు సిరాజ్, నరసింహ, నాగేంద్రమ్మ, శైలజ, రాజశేఖర్, పరమేష్ తదితర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలంటీర్ల ఎంపికకు దరఖాస్తులు

విశాలాంధ్ర - కర్నూల్ జిల్లా పరిషత్ : ప్రభుత్వం అందించే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు సేవా దృక్పథంతో గ్రామ, వార్డు వాలంటీర్ గా పని చేసేందుకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిషత్ సీఈవో సి.నాసర్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జి సృజన ఆదేశాల మేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న 95 గ్రామ, 77 వార్డులో ఖాళీగా ఉన్న మొత్తం 172 వాలంటీర్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 17 నుంచి 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. 21న దరఖాస్తుల పరిశీలన, 23 న మౌఖిక పరీక్ష, 25న ఎంపికైన అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 28న శిక్షణ తరగతులు ఉంటాయని, 30వ తేదీ నుంచి వాలంటీర్లుగా పని చేయవలసి ఉంటుందని తెలిపారు. తరగతివరాలకు సంబంధిత మండల, మున్సిపల్ అధికారులు సంప్రదించాలని తెలిపారు.

రోగులకు సహాయంగా నిలుస్తున్న తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : తలసేమియాతో బాధపడుతున్న ఎంతో మంది రోగులకు తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ వైద్య సాయం చేస్తూ అండగా నిలుస్తోంది. తలసేమియాతో పోరాడుతున్న వారు ప్రతిరోజూ అనేక సవాళ్లను ఎదుర్కొంటూ ఉన్నారు. వీళ్లకు కర్నూలులో 'తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ' సభ్యులు అండగా నిలుస్తూ ఉన్నారు. ముఖ్యంగా పిల్లల ప్రాణాలను రక్షించడానికి ఈ బృందం తీవ్రంగా కృషి చేస్తున్నారు.కర్నూలులో రోగుల సంరక్షణ, 156 మందికి రక్తమార్పిడి చేసి సపోర్టుగా నిలిచింది.తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ డిజార్డర్స్తో బాధపడుతున్న వ్యక్తులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో ముందుంది. దీంతో పాటు సొసైటీ రెండు రక్తదాన శిబిరాలను నిర్వహించింది. బ్రాహ్మణకొట్కూరు, అనంతపురంలో 31 యూనిట్ల మరో శిబిరంలో 86 యూనిట్లు రక్తాన్ని సేకరించింది. ఈ రక్తాన్ని ఉదారంగా రోగులకు దానం చేస్తోంది. రక్తమార్పిడి కోసం తలసేమియా రోగుల పట్ల సమాజం తాలుకా నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది.

ప్రభుత్వ కార్యక్రమాన్ని భగ్నం చేసిన టీడీపీ నాయకులు

వైసీపీ–టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం

వైసీపీ–టీడీపీ నాయకులతో చర్చిస్తున్న పోలీసులు

విశాలాంధ్ర- నందికొట్కూరు : నియోజకవర్గ కేంద్రమైన నందికొట్కూరులోని మారుతినగర్ 12వ వార్డులో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని పట్టణ మున్సిపల్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్‌తో పాటు పట్టణాధికారులు, కౌన్సిలర్ లాల్‌ప్రసాద్‌లు హాజరయ్యారు. అయితే మారుతినగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సగినేల వెంకటరమణ, గురుబాబు, సురేష్ తదితరులు కార్యక్రమాన్ని అడ్డగించారు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులు, టీడీపీ కార్యకర్తలను కర్రలతో అడ్డగించారు.దీంతో స్థానిక వైసీపీ నాయకులు కౌన్సిలర్ లాల్ ప్రసాద్ స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి అర్బన్ సీఐకి ఫిర్యాదు చేశారు.

దీంతో సీఐ ప్రకాష్ కుమార్ ఇరు వర్గాలను పిలిచి విచారించి సంఘటన బాధితులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

విశాలాంధ్ర- చాగలమర్రి: తెలుగుదేశంపార్టీకి రోజు రోజుకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తున్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ తెలియజేసారు. బుధవారం మండలంలోని పెద్దవంగలిలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి ఇంటింటికి వెళ్లి వైసిపి వైఫల్యాలను వివరిస్తూ బాబు షూరిటీ బాండ్లను అందజేశారు అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ పై రోజు రోజుకు జనాధరణ పెరుగుతున్నాదంతో జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు టీడీపీ వారిపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు.వైసీపీ ప్రభుత్వం రాజధాని లేని రాష్టంగా చేశారన్నారు.అభివృద్ధి గాలికి వదిలేసి ప్రచార అర్భాటాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి తిరిగి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. వైసిపి ప్రజా ప్రతినిధులు అభివృద్ధిని వదిలేసి పర్సెంటేజీల మీద దృష్టి సారించారన్నారు. నియోజకవర్గంలో వర్షాలు లేక,కాలువలకు నీరు రాక పంటలు ఎండిపోతుంటే పట్టించుకొనే వారే లేరన్నారు.

కార్యక్రమంలో మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ భాష, నంద్యాల స్పోక పర్సన్ సల్లా నాగరాజు, టిడిపి నాయకులు కొలిమ్ హుస్సేన్ వలి,నాగేంద్ర,నరసయ్య, నరసింహయ్య పాల షరీఫ్ నన్నే భాష,ముక్తార్, సంజీవరెడ్డి, నరసింహారెడ్డి,బాబయ్య, రామ్మోహన్, లక్ష్మిరెడ్డి, జనార్ధనరెడ్డి, లాల్ బాషాలతో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 56 వ జాతీయ వారోత్సవాలు

విశాలాంధ్ర-కోవెలకుంట్ల: మండల కేంద్రమైన కోవెలకుంట్ల గ్రంథాలయంలో 56 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా వి. రాఘవరెడ్డి గ్రంథాలయాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 20 తారీకు వరకు

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడమైనదని అందులో భాగంగా బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడమైనది తెలిపారు. గ్రంథాలయంలో విజ్ఞానం, సైన్సు, ఆధ్యాత్మిక, వ్యవసాయ , వేమన శతకము, సుమతి శతకము, పంచతంత్ర కథలు, దేశ నాయకుల జీవిత చరిత్రలు, మహాభారతం, భాగవత కథలు వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన కాంపిటీషన్ పుస్తకములు అన్ని తరగతుల ప్రజలకు ఉపయోగకరమైన పుస్తకములను ప్రదర్శనగా ఏర్పాటు చేయడం జరిగినదన్నారు.ఈప్రదర్శనలో వివిధ పాఠశాలల విద్యార్థులు గ్రంథాలయ పాఠకులు స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని వారికి అవసరమైన పుస్తకములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది బెల్ట్ జార్, రజియాబి మరియు వెంకటరామిరెడ్డి, నాగయ్య నాగరాజు,పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

రైతులకు కావాల్సిన ఎరువులు సిద్ధం

విశాలాంధ్ర- సి.బెళగల్ : రైతులకు కావాల్సిన ఎరువులు రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామం లోని రైతు భరోసా కేంద్రాన్ని వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ సందర్శించి రైతులతో మాట్లాడుతూ 2023 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఈక్రాప్ నమోదు చేసిన పంటలకు పంట రసీదులను అక్కడ ఉన్న రైతులకు అందజేశారు. తమ తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలోని గ్రామ వ్యవసాయ అధికారుల ద్వారా పంట రసీదులను రైతులు తీసుకోవాలని వ్యవసాయ అధికారి తెలిపారు. అనంతరం రైతులకు కావలసినటువంటి ఎరువులు రైతుబంధు కేంద్రం

లో అందుబాటులో ఉన్నాయని ఆయన రైతులకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంట వ్యవసాయ సిబ్బంది చెంచురాజు, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ- జనసేన ప్రభుత్వమే... టి.జి.భరత్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: తెలుగుదేశం పార్టీ నేతలు జనసేన పార్టీ నేతలందరితో కలిసి సమన్వయం చేసుకుంటూ కలిసి కట్టుగా ప్రజల్లోకి వెళతామని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. బుధవారం నగరంలోని మౌర్య ఇన్‌లో టి.జి భరత్ అధ్యక్షతన టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టి.జి భరత్‌తో పాటు, అబ్జర్వర్ శ్రీనివాసమూర్తి, జనసేన నేతలు హర్షద్ పాల్గొని భవిష్యత్ కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా టి.జి భరత్ మాట్లాడుతూ ఇరు పార్టీల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకెళ్లి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన భవిష్యత్తు గ్యారెంటీ

కార్యక్రమంలో జనసైనికులు కూడా పాల్గొనాలన్నారు. ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. టిడిపితో కలిసి పనిచేస్తున్న జనసైనికులకు తగిన గౌరవం ఉంటుందన్నారు. యువత ఓట్లు ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం వస్తే జరిగే మేలు ఏంటో ప్రజలకు వివరించాలని చెప్పారు. వార్డుల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి తమ ప్రభుత్వం వచ్చాక తీరుస్తామన్న భరోసా ఇవ్వాలని చెప్పారు. తాను గెలిచిన తర్వాత కర్నూల్లోని సమస్యలన్నీ పరిష్కరించి ప్రజలకు మెరుగైన భవిష్యత్తు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాలన్నీ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం నేతలు, కార్యకర్తలపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మన్సూర్ ఆలీఖాన్, అబ్బాస్, జేమ్స్, నరసింహులు, జనసేన నేతలు పవన్, అనిత, సతీష్, ప్రకాష్, వార్డు ఇంచార్జీలు, జన సైనికులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర -కోవెలకుంట్ల : మండల పరిధిలోని కలగొట్ల గ్రామ సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం దగ్గర నుండి తూర్పువైపు రెండు కిలోమీటర్లు దూరంలో గుర్తుతెలియని మగ శవం వయస్సు 35 నుండి 40 ఏళ్ల లోపు చూసిన రైతులు రెవనూరు ఎస్.ఐ.కి సమాచారం ఇవ్వడంతో ఎస్.ఐ. వెళ్లి చూడగా అక్కడ పొలం గట్టు దగ్గర వేప చెట్టుకు లుంగీతో ఉరి వేసుకుని ఉండడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-చాగలమర్రి : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు యూటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఎల్లప్పుడు ముందుంటదని యూటిఎఫ్ జిల్లా నాయకులు డెన్ని జాన్సన్, మహమ్మద్ గౌస్‌లు తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నవంగలి, చింతలచెరువు, పెద్దబోధనం, మద్దూరు, చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలు, వివిధ గ్రామాల లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు యూటిఎఫ్ కృషి చేస్తుందన్నారు.కార్యక్రమంలో హెచ్ఎం జీవయ్య, జిల్లా మీడియా కార్యదర్శి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర - పెద్దకడబూరు : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయాధికారిణి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో ప్రాథమిక పాఠశాల యందు విద్యార్థులకు

పదాల అంతాక్షరి, పద్యాల పోటీలు, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్స్, కథలు చెప్పుట మొదలగు విభాగాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 18న బహుమతులను సర్పంచ్ మరియు పాఠశాల కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విక్టోరియమ్మ, ఉపాధ్యాయులు నాగరాజు, సుజాత, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్రలో షటిల్ బాడ్మింటన్ ఎంపికలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : స్థానిక వెంకాయపల్లి రవీంద్ర మహిళా

ఇంజనీరింగ్ కళాశాలలో షటిల్ బాడ్మింటన్ సెలక్షన్ ట్రైల్స్ ను బుధవారంనిర్వహించారు. అనంతపురం జె.యెన్.టీ.యు.ఏకు చెందిన బి.జోజి రెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోటీల్లో కర్నూలు జిల్లా యూనివర్సిటీ పరిధిలో ఉన్న పలు ఇంజనీరింగ్ కళాశాలల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల స్పెషల్ ఆఫీసర్ డా. వై.పాండు రంగయ్య ప్రసంగించారు. తమ కలశాలలో నిర్వహిస్తున్న క్రీడా విశేషాలను గురించి, క్రీడల పట్ల యువత కనబరుస్తున్న ఆసక్తిని గురించి స్పెషల్ ఆయన వివరించారు. జెయెన్ టీయుఏ, సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ బి. జోజిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడల పట్ల పెరుగుతున్న ఆదరణ పట్ల హర్షం వ్యక్త పరిచారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కే.ఈ. శ్రీనివాస మూర్తి వైస్ ప్రిన్సిపాల్ డా. జె.ఉషశ్రీ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కలశాల చైర్మన్ జి. వీ. ఏం. మోహన్ కుమార్ మాట్లాడుతూ జెయెన్ టీయుఏ పరిధిలో జరుగుతున్న ఈ షటిల్ బాడ్మింటన్ సెలక్షన్ ట్రైల్స్ కు తమ కళాశాల వేదిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతానికి తమవంతు కృషి చేసిన అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బందిని ప్రిన్సిపాల్ ప్రశంసించారు.

జిల్లా అర్యవైశ్య అధ్యక్ష ఎన్నికలకు సిద్ధం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల జిల్లా కావడంతో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య ఎన్నికలకు సిద్ధం చేస్తున్నట్లు కర్నూల్ ఉమ్మడి జిల్లా ఆర్య వైశ్య అధ్యక్ష, కార్యదర్శులు, బింగుమల్ల శ్యామ్ సుందర్ గుప్త, వీర

బొమ్మ నాగ సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోఎన్నికల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కర్నూల్ కేంద్రంగా జిల్లా అధ్యక్ష పదవి తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకునేవారని, నంద్యాల జిల్లా కావడంతో ఇక్కడ జిల్లా అధ్యక్షులతో పాటు కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని టీజీ వెంకటేష్, ఇల్లూరు లక్ష్మయ్య, జయంతి వెంకటేశ్వర్లు సూచనల మేరకు ఎన్నికలు నిర్వహించేందుకు విధి విధానాలను తెలుపామని అన్నారు. ఎన్నికలకు 18 నుంచి 24 వరకు నామినేషన్లు, 25 స్క్రుట్నీ, 26 నుంచి 29 వరకు ఉపసంహరణ,డిసెంబర్ 7న ఎన్నికలు వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బింగుమల్ల శ్యామ్ సుందర్ గుప్త,కోశాధికారి పార్థసారథి,మాజీ అధ్యక్షులు భవనాసి శ్రీనివాసులు(వాసు), దమ్మాల వెంకటసుబ్బయ్య, మాజీ ప్రధాన కార్యదర్శులు మామిడి నాగరాజు,జంగం శెట్టి, మహాసభ రాష్ట్ర పొలిటికల్ వైస్ చైర్మెన్ ఖండ్ శ్యామ్ సుందర్ లాల్, రామ శేషు,రాం ప్రసాద్, కాల్వ విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎంను చేసుకుందాం

విశాలాంధ్ర -కొత్తపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమపథకాల అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ సోమల సుధాకర్రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి ఎంపీటీసీ సోమల స్రవంతి అన్నారు. బుధవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ సచివాలయం వద్ద సర్పంచు మశమ్మ ఎంపీడీవో మేరీ అధ్యక్షతన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు.ప్రభుత్వం చేస్తున్న సంక్షేమపథకాలు, అభివృద్ధి,పనులను, గ్రామానికి ప్రభుత్వం ఖర్చుచేసిన నిధులను. వివరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం అభివృద్ధికోసం రూ. 27,77,65,116లను ఖర్చుచేసిందన్నారు. ప్రభుత్వం నాడునేడు ద్వారా విద్యార్థులకు పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, గోరుముద్ద ద్వారా విద్యార్థులకు రుచికరమైన పోషకాహారంవంటి కార్యక్రమాలు చేశారన్నారు. అదేవిధంగా రైతుల అభివృద్ధి కోసం రైతు భరోసా, పంటనష్ట పరిహారం, మహిళల అభివృద్ధికోసం చేయుత, జగనన్న (వడ్డీ) ఆసరా వంటి పథకాలు అమలు చేశారన్నారు. హామీలో లేని మరిన్ని హామీలను నేరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. ఈ పథకాలన్ని మరళ ప్రజలకు అందాలంటే మళ్లీ జగనన్ననే సీఎంను చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ పథకాలు అమలు కావాలంటే ఆంధ్ర ప్రదేశ్ కు జగనే కావాలన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి వైసీపీ జెండాను ఎగురవేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో వీరాపురం సర్పంచు బోరెడ్డి సరస్వతి, జేసీఎస్ మండల కన్వీకర్ నాగలక్ష్మిరెడ్డి, వైసీపీ

ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎల్లయ్య, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్‌బాషా, వార్డు మెంబర్లు సుంకమ్మ, రమణారెడ్డి, సువార్తమ్మ, నాయకులు రవీంద్రారెడ్డి, రామిరెడ్డి, వెంకటస్వామిరెడ్డి, మంగలి శ్రీనివాసులు, లోకేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎర్రమఠం సర్పంచు బాల ఎల్లయ్య, నారాయణరెడ్డి, రహంతుల్లా, శ్రీనివాసులు యాదవ్, బాబురెడ్డి, కృష్ణుడు, రమేష్‌బాయి, మొల్ల బాషా, సచివాలయ సిబ్బంది. గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్‌లో కేసు సత్వర పరిష్కారం

విశాలాంధ్ర - కర్నూలు లీగల్ : కర్నూలుకు చెందిన పి.శివ సుదర్శన్ సమీర హిల్స్ అపార్ట్ మెంట్ నందు నివసిస్తున్నారు. అపార్ట్ మెంట్ నివా సితుల తరపున పి. శివ సుదర్శన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. సమీరాహిల్స్ అపార్ట్‌మెంట్లో దాదాపు 25 ఫ్లాట్లు ఉన్నాయని, అపార్ట్ మెంట్ సమీపంలో డ్రైనేజీ ఛానల్ తవ్వకంలో మున్సిపల్ వాటర్ పైప్‌లైన్ దెబ్బతినడంతో నీటి సరఫరా సమస్య మొదలైంది. పలుమార్లు మున్సిపల్ అధికారులకు సమస్య గురించి విన్నవించినా పరిష్కారం కాలేదు. ప్రతిరోజుకు 1000/- వెచ్చించి నీటి ట్యాంకర్లను కొనుగోలు చేస్తున్నారు. అపార్ట్‌మెంట్ నివాసితులు క్రమం తప్పకుండా ఆస్తి మరియు నీటి పన్ను చెల్లిస్తున్నారు.వాది మరియు అపార్ట్‌మెంట్ నివాసితులు ప్రతివాది యొక్క నిర్లక్ష్య వైఖరి మరియు నీటి సరఫరాలో సేవా లోపంతో బాధపడుతున్నారు. వారు ఈ విషయంలో శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించగా, అదాలత్ వారు కర్నూలు మున్సిపల్ కమీషనర్ వారికి నోటీసులు ఇచ్చి ఇరు పార్టీలకుఆమోధయోగ్యమైనటువంటి పరిష్కారాన్ని సూచించారు. ఆ విధంగా కేసు సత్వరంగా పూర్తి అయినది. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం. వెంకట హరినాథ్ సభ్యులు టి.శివ శంకర్ రెడ్డి, డి. రాజు బాబు ఆధ్వర్యంలో మరియు న్యాయవాదులు పి. శివ సుదర్శన్ మరియు డి. ఎల్లా రెడ్డి సమక్షం లో రాజీ పరిష్కారం జరిగింది. కర్నూలు ప్రజలకు తెలియచేయడం ఏమనగా ప్రజా వినియోగ సేవలకు సంబంధించి ఏవైనా కేసు ఉంటే శాశ్వత లోక్ అదాలత్ ను సంప్రదించి సత్వరంగా పరిష్కరించుకోగలరు. ఈ వ్యవస్థ ద్వారా 10 ప్రజా ప్రయోజిత సేవ రంగాలకు సంబంధించిన సేవలలో లోపాల వలన కలుగు నష్టాలను విన్నవించి సంబంధించిన న్యాయం త్వరగా పొందవచ్చును. రవాణా సేవలు రోడ్డు, విమాన సేవలకు సంబందించి ప్రయాణికులు తరలింపు, సరుకుల

రవాణా సేవలు. పోస్టల్, టెలిగ్రాఫ్, టెలిఫోన్ సేవలు విద్యుత్, నీటి సరఫరా సేవలు ఏదేని సంస్థ ద్వారా అందించే సేవలు మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీల సంబందించి: మురుగు నీటికాల్వల నిర్వహణ మరియు ప్రజా పరిరక్షణ లాంటి సేవలు ప్రజా ఆరోగ్యం, వైద్య చికిత్సా కేంద్రాలు: ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్ సేవలు భీమా సౌకర్యం : జీవిత భీమా, సాధారణ భీమాలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో జీవిత భీమా, వాహన, పంటల, గృహ భీమా మొదలగు సేవలు.బ్యాంకింగ్, ఇతర ఆర్థిక సంస్థల సేవలు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సేవలు. విద్య, విద్యాసంస్థలు: ప్రభుత్వ, ప్రైవేటు విద్య సంస్థల సేవలు. స్థిరాస్తి వ్యాపారం (రియల్ ఎస్టేట్): ఫ్లాట్స్ మరియు గృహ నిర్మాణ సేవలు. ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోకదాల అధ్యక్షులు ఎం వెంకట హరినాథ్ వినియోగించుకొని పరిష్కారం జరుగుతాయని వారు తెలిపారు.

మద్దిలేటయ్య ఆదాయం రూ.42 లక్షలు

విశాలాంధ్ర-బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్.ఎస్. రంగాపురం గ్రామ శివారులో వెలసిన వైష్ణవ క్షేత్రమైన మద్దిలేటిస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు 79 రోజులు గా సమర్పించిన ముడుపులు, కానుకలు, నగదును ఆలయ అధికారులు బుధ

వారం లెక్కించారు.ఈ లెక్కింపు లో స్వామి వారికి రూ.3,654,108లు, అమ్మవారికి 6,12,973లు మొత్తం రూ.42,67,081ల నగదు, 29.500 గ్రాముల బంగారు, 2 కేజీల వెండి ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో డి. పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సీతా రామ చంద్రుడు లు తెలిపారు.హుండీ లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు లక్ష్మీనాయుడు, సుశీల,తనిఖీ అధికారి శ్రీనివాస రెడ్డి, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంచుకోవాలి

పాణ్యం-విశాలాంధ్ర: విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని శాఖ గ్రంధాలయాధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని శాఖ గ్రంధాలయంలో గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం విద్యార్థులకు పుస్తక ప్రదర్శన నిర్వహించారు.అనంతరం మారక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా గ్రంధాలయ అధికారిని భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే గ్రంధాలయాలకు వెళ్లి తెలియని విషయాలు తెలుసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో గవర్నమెంట్ హై స్కూల్, శ్రీ లక్ష్మీ గాయత్రి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసిన ప్రభుత్వం వైసీపీ

విశాలాంధ్ర -ఆత్మకూరు టౌన్ : పట్టణంలోని గరీబ్ నగర్ సచివాలయం 16, 18, 19 వార్డులలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి వైఏపీ నీడ్ జగన్ కార్యక్రమం ప్రజాప్రతినిధులు, పట్టణ పార్టీ అధ్యక్షులు అధికారులతో కలిసి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఆసియా, వైసీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ మీర్, ప్రజా ప్రతినిధులు, విజయ చౌదరి, రాజగోపాల్, కౌన్సిలర్లు ప్రత్యక్ష నగదు బదిలీ డాష్ బోర్డును ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలో వైఏపీ నీడ్ జగన్ ప్రోగ్రాం ప్రతిష్టాత్మక మన వైఎస్ఆర్ ప్రభుత్వం నిర్వహిస్తున్నామని ఈకార్యక్రమం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎలాంటి అభివృద్ధి పరిపాలన చేశారో మన పేద బడుగు ప్రజలకు జగనన్న నవరత్నాలు ఏ విధంగా అందుతున్నాయో, జగనన్న ప్రభుత్వం మన రాష్ట్రానికి సచివాలయ వ్యవస్థను, వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి మన పేద ప్రజల కుటుంబాల దగ్గరికి ఇటువంటి దళారీ వ్యవస్థ లేకుండా డైరెక్ట్‌గా నగదు బదిలీ పథకం ద్వారా బ్యాంక్ అకౌంట్లో జమ చేసిందన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మన కుటుంబాల దగ్గరికి చేరుస్తూ, ఎన్నో సేవా కార్యక్రమాలు మన నియోజవర్గంలో చేస్తున్నారని శిల్పా చక్రపాణి రెడ్డి నియోజవర్గంలో సున్నిపెంటను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘతన ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు.

సమావేశం తదనంతరం వైఎస్ఆర్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, ఇన్చార్జులు జేసిఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు మహిళా కార్యకర్తలు వైఎస్ఆర్ పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, జే సి ఎస్ కన్వీనర్లు, వైయస్సార్ పార్టీ నాయకులు, వార్డు నాయకులు, ఇన్చార్జులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, శిల్పన్న అభిమానులు, యువకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పాల్గొన్నారు.

ఐకమత్యంతో గ్రామాభివృద్ధికి పనిచేయాలి

విశాలాంధ్ర-ఆదోని రూరల్ : గ్రామాల్లో అధికారులు గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో గీతావాణి తెలిపారు.బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు బడాయి దానమ్మ అనారోగ్య కారణాల వల్ల మండల పరిషత్ సమావేశానికి హాజరు కాలేనందున మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పుష్పావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.విద్య రెవిన్యూ వ్యవసాయ గృహ నిర్మాణ త్రాగునీరు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇందిరా కాంతి పథకం పశుసంవర్ధక శాఖ జగనన్న స్వచ్ఛ సంకల్పం స్త్రీశిశు సంక్షేమ శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్వసభ్య సమావేశం ఉద్దేశించి ఎంపీడీవో గీతావాణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమస్యలు ఉన్న సభ దృష్టికి తీసుకువస్తే అలాంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. పథకాలకు అర్హులై ఉండి అలాంటివారికి అందకపోతే అలాంటి జాబితాను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధి కూలీలు రైతులు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉమ్మడి పార్టీల అభ్యర్ధి గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

విశాలాంధ్ర -గోనెగండ్ల: జనసేన - టీడీపీ పార్టీల ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సమావేశాలకు నిర్వహణ సంప్రదింపుల బాధ్యతలను జనసేనపార్టీ ఎమ్మిగనూరు ఇంఛార్జి రేఖగౌడ్ ఎంపికపై మండల జనసేన నాయకులు గానిగబాషా, మాలిక్ , ఖాసిం వలి,హర్షం వ్యక్తం చేశారు. ఉభయ పక్షాల ఆధ్వర్యంలో జరిగే సమావేశాలు, కార్యక్రమాలు, కార్యకర్తలను సమన్వయ పరిచే బాధ్యతలు అధినేత పవన్ కళ్యాణ్ అప్పగించారు. త్వరలోనే అధిష్టానం పిలుపు మేరకు నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో చేసే భవిష్యత్ కార్యాచరణపై జనసేన - టీడీపీ పార్టీలు ఉమ్మడిగా ప్రణాళికను ఏర్పాటు చేసుకొని ఉమ్మడి పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్ధి గెలుపే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కోసం సైనికుల్లా పనిచేస్తామని తెలిపారు. మద్దిలేటి, మల్లి, వెంకటేష్ పాల్గొన్నారు.

జగన్‌కు అండగా నిలుద్దాం..సంక్షేమ పథకాలు పొందుదాం..!

విశాలాంధ్ర - ఆస్పరి : అన్ని వర్గాల ప్రజలకు అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని జడ్పిటిసి దొరబాబు, రామాంజనేయులు, జిల్లా కేడీసీసీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, జెసియస్ కన్వీనర్ బసవరాజులు కోరారు. బుధవారం మండల పరిధిలోనే హలిగేర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచ్ బోయ లింగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు.వైయస్సార్ క్రాంతి పథం ఏపీఎం రాఘవేంద్ర సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించారు.వైసీపీ కో -కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసులు, వైసీపీ బీసీ సెల్ నాయకులు నాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయ, పంచాయితీ కార్యదర్శి చిన్న వెంకటేష్, రామాంజిని, అంజినయ్య, మహానంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రూ.20.37 కోట్లతో సంక్షేమాభివృద్ధి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మండలంలోని బాచ్చాపురం, జి.జంబులదిన్నె గ్రామాల్లో రూ.20.37 కోట్లతో సంక్షేమాభివృద్ధి జరిగిందని ఎంపిపి గజ్జల రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారంజి.జంబులదిన్నెలో పల్లెకు పోదాం మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ జి జంబులదిన్నె, బాచ్చాపురం గ్రామాల్లో పక్షపాత ధోరణి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించామన్నారు.మన గ్రామంలో 2004లో గంగుల ప్రతాపరెడ్డి హయంలో 250 గృహాలు మంజూరయ్యాయని, 2019లో మన ఎమ్మెల్యేగా గంగుల బ్రిజేంద్రరెడ్డి అయ్యాక గ్రామంలో అభివృద్ధి పనులు ఎక్కువగా జరిగాయన్నారు. రెండు ఎకరాల పొలాన్ని కొని ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేరాయిపల్లె మెట్ట- జంబులదిన్నె గ్రామానికి రాకపోకల కోసం కొన్నేళ్లుగా ఇబ్బంది ఉండేదని, ఎమ్మెల్యే గంగుల సహాయ సహకారాలతో వకులానది మీద పెద్ద బ్రిడ్జిని, చిన్న బ్రిడ్జిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాచ్చాపురంలో వంట కాలువల ఏర్పాటు, సిసి రోడ్లు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు గంగుల బిజెంద్రారెడ్డి సహాయ సహకారాలతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు ఏప్రభుత్వాలు చేయలేదని మళ్లీ సంక్షేమ పథకాలు కావాలంటే మన ముఖ్యమంత్రిని, మన శాసన సభ్యుడు గంగులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని గజ్జల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ కిషోర్ కుమార్ రెడ్డి, ఈఓఆర్డి తాహెర్ హుస్సేన్, సూపరింటెండెంట్ శ్యామల, సర్పంచ్ నందీశ్వరయ్య,ఉప సర్పంచ్ శివ నారాయణ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, విజయ డైరీ డైరెక్టర్ దస్తగిరి రెడ్డి, వైకాపా సీనియర్ నాయకులు గంగుల రామిరెడ్డి, గుద్దేటి వెంకటసుబ్బారెడ్డి, ముత్తలూరు శంకర్ రెడ్డి, నంద్యాల రాఘవరెడ్డి, ప్రతాపరెడ్డి, గజ్జల రంగస్వామి రెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన సంక్షేమం అభివృద్ధి కు సంబంధించిన సూచిక పట్టికను ఎంపీపీ ఆవిష్కరించారు.